క్లుప్తంగా

అదుపు తప్పిన బస్సు



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం దీక్షకుంటగ్రామ శివారులో ములుగు జిల్లా పస్రా నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు గురువారం సాయంత్రం అదుపు తప్పి రోడ్డు దిగింది. గ్రామస్తులు ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. దీక్షకుంట శివారులో మిషన్ భగీరథ నీరుఎ లీకేజీ వల్ల బురద కావడంతో బస్సు అదుపు తప్పి కల్వర్టును తాకి ఆగినట్లు తెలిపారు. బస్సు వేగం లేకపోవడం, డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులకు ఏలాంటి గాయాలు కాలేదు. సుమారుగా 45మంది ప్రయాణికులు బస్సులో ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

అరటి తోట దగ్ధం



చిట్యాల: మండలంలోని రాంచంద్రాపూర్ శివారులో ప్రమాదవశాత్తు ఓ రైతుకు చెందిన అరటి తోట గురువారం దగ్ధమైంది. బాధితుడు గాజే సురేష్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన వెల్పుల రమేశ్‌కు చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన గాజే సురేష్ కౌలుకు తీసుకుని అరటి తోట నాటాడు. ఈ క్రమంలో కోతకు వచ్చిన సమయంలో అరటి తోటలో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుపక్క గల రైతులు చూసి మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నం చేశారు. చివరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చిన కూడా తోటలోకి వాహనం వెళ్లే పరిస్థితి లేకపోవడంతో అరటి తోట కొంత మేరకు మంటలు వ్యాపించాయి. దీంఓ ఎకరం అరటి తోట కాలి పోయినట్లు బాధితుడు తెలిపాడు. సుమారు రూ.రెండు లక్షల పంట నష్టపోయాయని బాధితుడు బోరున విలపించాడు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వేడుకున్నాడు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత



వాజేడు: మండల పరిధిలో ఇటీవల ఈశ్వరి, రాజబాబు, శ్రీనివాస్, కోటేష్ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు ఫోన్లను రికవరీ చేశారు. ఈ మేరకు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజ్‌కుమార్ బాధితులకు అందజేశారు.

నిలిచిన నిర్మాణాలు



అసంపూర్తిగా ఉన్న తాడిచర్ల-1 సబ్‌సెంటర్



అసంపూర్తిగా ఉన్న డాక్టర్ రెసిడెన్షియల్ క్వార్టర్

- నిధులు లేక అసంపూర్తిగా ఆరోగ్య ఉపకేంద్ర భవనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మల్హర్: గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల అనారోగ్య సమస్యలను తీర్చడంతో పాటు పిల్లలకు వివిధ రకాల వ్యాక్సిన్లను వైద్య సిబ్బంది ఆయా గ్రామాల పరిధిలో ఉన్న సబ్ సెంటర్లలలో ఇస్తూ ఉంటారు. అలాంటి ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణాలు నిధుల లేమితో అర్ధాంతరంగా నిలిచి పోయాయి. మల్హర్ మండలంలో ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా రుద్రారం, అన్సాన్‌పల్లి, పెద్దతూండ్ల గ్రామాల్లో సబ్ సెంటర్లకు సొంత భవనాలు ఉన్నాయి. వల్లెకుంట, ఎడ్లపల్లి, మల్లారం గ్రామాల్లో సెంటర్లు గ్రామ పంచాయతీ భవనాల్లో కొనసాగుతున్నాయి. అలాగే తాడిచర్ల-1, తాడిచర్ల-2 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. తాడిచర్ల-1 సెంటర్, మల్లారం సబ్ సెంటర్ల నిర్మాణాలకు ఎస్‌హెచ్‌ఎం ద్వారా ఒక్కొక్క సెంటర్‌కు రూ.20 లక్షలు, తాడిచర్ల ప్రాథమిక కేంద్రంలో వైద్యాధికారి రెసిడెన్షియల్ క్వార్టర్ భవనానికి రూ.19.50 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో 2024 సంవత్సరం మార్చిలో అధికారులు శంకుస్థాపన చేశారు. తాడిచర్ల సబ్ సెంటర్-1 బెస్‌మెంట్ వరకు, క్వార్టర్ స్లాబ్ వరకు నిర్మాణాలు చేపట్టారు. మల్లారంలో సబ్ సెంటర్ నిర్మాణం మాత్రం శంకుస్థాపనకే పరిమితమైంది. దీంతో గ్రామంలో వైద్య సేవలు అందించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి భవన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



రేగొండ: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలను అమ్ముకునే సమయంలో చాలా మంది రైతులు దళారులకు కట్టబెడుతున్నారని తెలిపారు. దీంతో తూకం, ధరలో మోసపోయి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. పంట నష్టం వివరాలను వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, ఇళ్ల నష్టం వివరాలను తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేయాలని సూచించారు. అలాగే అకాల వర్షానికి దెబ్బతిన్న అరటి తోటను పరిశీలించారు. అనంతరం మండలంలోని తిరుమలగిరి, గూడెపల్లి గ్రామాలలో ఈదురుగాలులతో ఇంటి పైకప్పు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. బాధితులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. అనంతరం కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడేపాక గ్రామంలో జరిగిన మేడే వేడుకల్లో పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనాథ్ డీఎం రాములు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వర రావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, కాంగ్రెస్ నాయకులు బాబురావు, పున్నం రవి, దేవేందర్, రమణారెడ్డి, వీరబ్రహ్మం, కుమారస్వామి, రాజు, రైతులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మొగుళ్లపల్లి: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అండగా ఉందన్నారు. తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ సుభాష్‌చంద్రబోస్, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రఫీ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే అకినాపల్లి, మొగుళ్లపల్లిలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఏటూరునాగారం: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని రామన్నగూడెంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. గామంలో సైడ్ కాల్వలు లేవని గ్రామస్తులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు ఎంపీడీఓతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి రూరల్: తడిసిన ధాన్యాన్ని ఏలాంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రంలో తడిచిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటే రైతులకు ఇబ్బందులు ఉండవన్నారు. 10 రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఉంచడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల, గ్రామకమిటీ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఏటూరునాగారం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో ఆటో డ్రైవర్లకు ఎస్సై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగీ వాహనాలు నడపొద్దని అన్నారు. ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయరాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వేసవి శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్న అధికారులు

కాటారం: విద్యార్థులు, చిన్నారులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అడ్డూరి బాబు, కాటారం ఎస్సై-2 శ్రీనివాస్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ చైర్మన్ పంతకాని సమ్మయ్య సూచించారు. మండల కేంద్రంలో క్రీడా శాఖ ఆధ్వర్యంలో 14 సంవత్సరాల బాలబాలికల కోసం ఏర్పాటు చేసిన వేసవి ఉచిత శిక్షణ క్రీడా శిబిరాన్ని గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి, క్రీడా నైపుణ్యతను పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేసిందన్నారు. ప్రత్యేక కోచ్ ద్వారా శిక్షణ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కోచింగ్‌కు పంపిస్తే సెల్‌ఫోన్ ఆటలకు దూరంగా ఉంటారని తెలిపారు. శిక్షణ వివరాల కోసం కోచ్ లక్ష్మణ్ సెల్ నంబర్ 95051 86112 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీరస్వామి, కాంగ్రెస్ మంథని నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, జనగామ కరుణాకర్‌రావు, ఆత్మకూరి కుమార్, డాక్టర్ బండి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో సమ్మర్ క్రీడా క్యాంపును ఎంఈఓ కొయ్యడ మల్లయ్య మండల అటవీ శాఖ అధికారి నరేంద్ర గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోచ్ కరిష్మా, రాధిక, స్వామి, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, శంకర్, భిక్షపతి ఉన్నారు.

వాజేడు: బాల బాలికలు క్రీడల సవమ్మర్ క్యాంపును సద్వినియోగంచేసుకోవాలని కోచ్ ఉయిక నవీన్ కోరారు. మండల పరిధిలోని కోయవీరాపురం పాఠశాల ప్రాంగణంలో గురువారం క్రీడల సమ్మర్ క్యాంపును ప్రారభించారు. జూన్ 6 వరకు క్యాంపు కొనసాగుతుందని నవీన్ వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



కిన్నెర అజయ్‌ని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



మొట్లపల్లిలో పాఠశాలలో విద్యార్థులకు సన్మానం



ఇస్సిపేట పాఠశాలలో విద్యార్థులకు సన్మానం

భూపాలపల్లి అర్బన్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభకనబర్చారు. మండలంలోని జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కిన్నెర అజయ్ 551 మార్కులు సాధించగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు సేవానాయక్, వీరయ్య అభినందించారు. అలాగే పాఠశాలలోని సన్నీ 529, చరణ్‌తేజ 526, సిందూప్న 522 మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. పాఠశాలలో 77 మంది విద్యార్థులకు గాను 74 మంది పాసైనట్లు తెలిపారు.

గొల్లబుద్దారంలో వందశాతం ఉత్తీర్ణత

మండలంలో బుద్దారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందల రవీందర్‌రెడ్డి తెలిపారు. హట్కరి అంజలి 540 మార్కులు, చల్పూరి వైష్ణవి 529, సిరి 505 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు.

మొగుళ్లపల్లి: మండలంలోని ఇస్సిపేట, మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం ఆయా పాఠశాలల ఆవరణలో ఎంపీడీఓ సుభాష్ చంద్రబోస్, ఎంఈఓ లింగాల కుమారస్వామి, ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మొట్లపల్లి పాఠశాలలో తులాల హాసిని 519, పాడిశెట్టి అభిరామ్ 505, అల్లకొండ శ్రీనిధి 489 మార్కులు సాధించారు. అలాగే ఇస్సిపేట పాఠశాలలో కదరు మేఘన 558, ప్రత్యూష 512, శివ మారుతి 508,అక్షిత 505, కళ్యాణి 504 మార్కులు సాధించగా వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నలుగురి అరెస్టు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో బావను బావమరిది డబ్బుల విషయంలో కొడుకులతో కలిసి కిడ్నాప్ చేసిన ఘటనలో పోలీసులు నలుగురిని అరెస్టు చేసి గురువారం రిమాండుకు తరలించారు. మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాలు గత నెల 28న మహదేవపూర్‌లోని హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈగా పనిచేస్తున్న ఎండీ ఇసాక్ హుస్సేన్‌కు అతడి బావమరిది అంకూస్‌కు డబ్బుల విషయంలో గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అంకూస్ కుమారులు రియాజ్, బషీర్, యాకుబ్‌లతో కలిసి కారులో వచ్చి కిడ్నాప్ చేశారని బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తు ప్రారంభించి నిందితులను, వారు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

రేగొండ: జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే గండ్ర



కొత్తపల్లిగోరిలో..



మొగుళ్లపల్లిలో..



ఘనంగా మే డే వేడుకలు

జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలను కార్మికులు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో పలు సంఘాల ఆధ్వర్యంలో జెండాలు ఆవిష్కరించి ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాలను కోరారు.

\- సాక్షి నెట్‌వర్క్



భూపాలపల్లి అర్బన్: మేడేలో పాల్గొన్న సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు



మొగుళ్లపల్లి: ఇప్పలపల్లిలో..



మల్హర్‌లో..



తాడిచర్లలో..



భూపాలపల్లి అర్బన్: సీఐటీయూ ఆధ్వర్యంలో..



వల్లెకుంటలో..

ఎండలోనే.. నిరీక్షణ

- బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



పస్రాలో ఎండలో నిలబడి బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



గోవిందరావుపేటలో..



చల్వాయిలో..

గోవిందరావుపేట: మండలంలో ఆర్టీసీ బస్టాండ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలం నుంచి రోజు వందలాది మంది ప్రయాణికులు హనుమకొండ, వరంగల్, భద్రాచలం, విజయవాడ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మండలంలో జాతీయ రహదారిపై ఉన్న మేజర్ గ్రామ పంచాయతీలు చల్వాయి, గోవిందరావుపేట, పస్రాలో బస్ షెల్టర్లులు లేక ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. బస్టాండ్ వద్ద ఏలాంటి షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు నిలడబడుతూ.. తీవ్ర అవస్థలు పడుతూ బస్సుల కోసం వేచి ఉంటున్నారు. బస్సుల కోసం చంటి పిల్లలతో కుటుంబ సభ్యులు ఎండలోనే వేచి చూడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. రోడ్లపై నిల్చొని ఉన్నా కనీసం తాగడానికి నీరు సైతం దొరకని పరిస్థితి. కాగా, మేజర్ గ్రామ పంచాయతీల్లో, మండల కేంద్రాల్లో కూడా జాతీయ రహదారిపైనే బస్సులు ఆపడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. విచ్చల విడిగా ఆటోలు, జీపులు ఇతర వాహనాలు నిలిపి ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఆదాయం కోసం చూపుతున్న దృష్టి ప్రయాణికుల సౌకర్యాలపై చూపడం లేదంటున్నారు.

ఒకప్పుడు చల్వాయిలో పెద్ద బస్టాండ్..

జిల్లాలోనే చల్వాయి గ్రామంలో ఉన్న బస్టాండ్ ప్రాంగణం చాలా పెద్దది. ఈ బస్టాండ్‌లో అన్ని రకాల బస్సులు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ, డీలక్స్ వంటి వాటికి స్టాప్ ఉండేది. సుమారుగా ఎకరం విస్తీర్ణంలో ఈ బస్టాండ్ ఉండేది. గత నాలుగు సంవత్సరాల కిందట పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో నేల మట్టం చేశారు. దీంతో ఖాళీ స్థలం రోజు రోజుకు ఆక్రమణకు గురవుతోందని పలువరు ఆరోపిస్తున్నారు. ఈ ఖాళీ స్థలంలో మళ్లీ బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే పలు చోట్ల నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ తీసుకోవాలని స్థానికులు తెలుపుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

మండలంలోని పస్రా గ్రామంలో ఆర్టీసీకి సంబంధించి సొంత స్థలం లేదు. గోవిందరావుపేట, చల్వాయి గ్రామాలలో ఆర్టీసీ సొంత స్థలం ఉండడంతో అక్కడ బస్టాండ్ ప్రాంగణాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. చల్వాయిలో ఆర్టీసీకి సంబంధించిన స్థలం ఆక్రమణకు గురి కాకుండా చుట్టూ ఫినిషింగ్ చేశాం.

\- జ్యోత్స్న, వరంగల్-2 డిపో మేనేజర్

ఇబ్బందులు పడుతున్నారు..



బస్ షెల్టర్లు లేక జాతీయ రహదారిపై ప్రయాణికులు ఎండలో గంటల తరబడి ఎదురుచుస్తూ బస్సుల కోసం ఎదురు చూడాల్సిందే. చల్వాయిలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ఆక్రమణకు గురవుతోంది. ఈ స్థలాన్ని కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు వాడుకుంటున్నారు. అధికారులు స్పందించి బస్ షెల్టర్లను నిర్మించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

\- రమణ, మాజీ సర్పంచ్, చల్వాయి

నర్సాపూర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ



వెంకటాపురం(ఎం): జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరిస్తూ గురువారం మండలంలోని నర్సాపూర్‌లో టీఎంపీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ మాల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాస్, నిర్మల, వసంత, శంకరమ్మ, సారమ్మ పాల్గొన్నారు.